అన్నాడు, అన్నానన్నాడు కొడుకు "ఎంత కావాలేటి?" అన్నాడు కొడుకుని.

"రెండు వేల"న్నాడు కొడుకు.

"బట్టల కేన్రా రెండు వేలు. బలాదూర్‌రా తిరగటానికి అవేటి సరిపోతాయి. ఆళ్ళేటి సైనుగుడ్డలూ, సీటీగుడ్డలూ కట్టుకుంటా రనుకుంటావేటి? మాట కద్దురాక. "ఎయ్యిస్తాను తీసుకో? నీ కిష్టంవచ్చినకాడ కొనుక్కో కాని ఆ రామారావు కొట్టుపాతబాకీ ఇదిగో ఈ అయిదువేలూ కట్టి" అంటూ యినస్పెట్టెలోంచి అన్నీ వొందరూపాయిలకాయితాలు తీసిచ్చేడు.

మద్దేనం వొచ్చినారు యినసపెక్టరూ, తాసిల్దారూనూ. ఆళ్ళతో ఆ మాటా యీ మాటా సెప్పి ఆ రామారావు గోడికి దొంగనోట్ల యాపోరం వుందేమోనని అనుమానం. ఆడి బట్టలసాపు చెక్ చెయ్యండి. కాని తొందరపడి ఆడికి బేడీలేసి తీసుకుపోవద్దు" అని ఆళ్ళని అంపించేశేడు. ఆళ్లెళ్ళిన అరగంటకి ఎవికెమికా యిరిగి పోయీటట్లు ఏడుస్తూ కారు దిగింది రామారావుబాబు పెళ్లాం.

"కదంతా సెప్పి బేడీలేసినారు బాబూ. నువ్వే కాపాడాల" అని ఎంకటరత్తం బాబు కాళ్ళమీద పడిపోనాది.

ఆదికి ముందే కాపాడతానన్లేదు ఎంకటరత్తం బాబు "ఇంత డబ్బుండి యీ ఎదవ దొంగనోట్ల యాపారం ఎందుకెట్టేడు? ఆశకి అద్దుండాలి. పాపానికి శిచ్చుండాలి. నాను రానన్నాడు.

"నువ్వు రాకపోతే నాన్నూతిలో పడిపోతానంది ఆ యమ్మ.

"జైలు నుంచి ఒచ్చేక ఆడు పడతాడు కానీ ఎదవ యాపారాలు ఎట్టీవోడు ఎదవ చందాలు కట్టడానికి ఏడు పెందుకు" అంటూ ఎంతమందికో ఫోన్లు చేసి కారెక్కేడు. "నానొచ్చీ వొరకూ నువ్విక్కడే వుండు" అని రామారావు పెళ్ళంతో అని.

మళ్ళీ ఇంటికొచ్చేటప్పుడు రామారావునీ, లచ్చ రూపాయల్ని ఎంటబెట్టుకొచ్చేడు.

లచ్చ దేనికనుకుంటా రేటో గాలివోన సందా కేసుకు ముందు పాతిక వేలైతే పట్టుకున్నాక యబై అన్నాడు. బేడీ లెయ్యకుండా ఉండడానికి ఐదు వేలూ, పోలీస్ టేశన్‌కి నడి పించకుండా ఉండడానికి ఐదు వేలూ అన్నాడు. కేడు పెట్టుకున్నందుకు ఐదు వేలూ, సిల్లర కరుచులకి మరో పదీ అన్నాడు. ఇదిగో నీ మిగిలిన పాతిక నువ్వు తీసుకో" అని రామారావుకి ఇచ్చేసేడు. ఆ తర్వాత పోలీసోళ్ళ సొమ్ములో సగం ఆళ్ళకి పారేసేడు. గాలివోన సందా పాతిక వేలూ కట్టీసేడు. "ఇది వసూలు జేసేసరికి తలప్రాణం తోక్కి రాలేదు పూర్తిగా పోయిందంటూ.

"నాకు తెలకడుగుతాను. రామారావు కొట్లో దొరికిన దొంగనోట్లు ఎంకటరత్నం బాబు పంపినవేనంటావేఁటి?"

"లేదు, అసలు నోట్లు పెట్టిన పిల్లలంటాను. బుర్రుంటే సాలదురా, అందులో బుద్ధుండాలి. లేకపోతే ఏటా ఎదవ పెశ్న"

"ఆ బాబు కాడ దొంగ బంగారం ఉంది కదా. నోట్లు బణాయించడం దేనికీ అంట?".

"దొంగ బంగారం ఎక్కడు పాతేసాడో ఎంకటరత్నానికి తెలియొద్దా అంట."

"హమ్మ లంజికొడుకెంత పన్జేసేడు. కదన్నా కదకాదు గురూ, యమకద"

"కద ఎప్పుడువుద్దో తెలీని లంజికొడుకు కద ఇనడం ఎందుకూ అంట. అప్పుడే అయిపోయిందనుకున్నావేటి? ఎంకటరత్నం బాబే తెలివైనోడనుకున్నావ్ కాబోలు ఆడి బాబు తెలివి రామారావు కుంది. మరి ఆ వేళ నుంచీ ఆర్నెల్లు తిరిగీ వొరకూ ఆ బాబు అంటే ఎవరనుకున్నావ్–రామారావు బాబు తన దొంగ నోట్ల యాపారం తగ్గించేసుకున్నాడు."

**(1975)**

# డబ్బు - 2

**దా**రి మధ్యలో అంత వానవస్తుందని మేము కలలో కూడా అనుకోలేదు. ఇంకో గంటవరకు వాన రాకపోయి వుంటే హాయిగా విశాఖపట్నం చేరిపోయే వాళ్ళం. రోడ్డు మీద కారు ఎగిరి పోతుందేమోనన్నంత తీవ్రంగా వీస్తోంది గాలి. అయినా మొండిగా కొంతసేపు కారు పోనిచ్చేం. కారు ముందున్న అద్దాలు కరిగిపోతున్న మంచు పలకల్లా ఉన్నాయి. కారు లైట్లు వెల్తురులో వర్షపు చినుకులు వెండి మేకుల్లా ఉన్నాయి.

ఒకచోట కారు ఆపక తప్పిందికాదు ముందు ఆగివున్న లారీలు బస్సులూ చూసి ఆ లారీలకు ముందు రోడ్డుకి అడ్డంగా పెద్ద చెట్టు పడిపోయిందట. అంచేత ముందుకి వెళ్ళలేం. కారు

దిగినా అద్దాలు దించినా కరదు గట్టిపోవడం తథ్యం, వర్షం తగ్గింది కాని గాలి హెచ్చిపోయింది. రోడ్డుపక్క నున్న చెట్లని మొదళ్ళ దగ్గర్నుంచీ గిరిగిరా తిప్పేస్తోంది. గాలికి రాలిపోయిన ఆకులు రోడ్డుని కప్పేసేయి. కారుని వదిలేస్తే, గాలికి ఎగిరి పోతుందేమో నన్నంత బలంగా వీస్తోంది గాలి. కాని కారులో కూర్చుంటే ఏ చెట్టో మీదపడి చచ్చిపోతామని భయం. అయినా మొండిగానే కూర్చున్నాం. భగవంతుణ్ని తల్చుకుంటూ. ఇంతలో మా వెనుక 50 గజాల దూరంలో ఒక చెట్టు దభీమని పడి పోయింది. ఇంకా కారులో కూర్చొని వుండడం అసంభవం. కేవలం తెలివి తక్కువ కాని ఎక్కడికి వెళ్ళడం! ఎక్కడికైనా సరే. పక్కవున్న పొలాల్లోకి పోతే పాములూ, కప్పలు ఉండొచ్చుగాని చెట్లు పడినడుములు విరగవు. అంచేత కారు దిగక తప్పలేదు. దిగేక కనిపించింది. వందగజాలలో ఒక పాకలాంటిది. పెద్ద పెద్ద చెట్లు కూడా ఆగని ఆ గాలికి ఆ పాక ఎలా ఆగి నిలబడి వుందో ఆశ్చర్యమే!.

పాకలో వున్న గేస్ లైటు వెల్తురును బట్టి అందులో ఎవరో ఒకరు వుండకపోరు. వాళ్ళు ఎంతచెడ్డ వాళ్ళయినా పొలాల్లో పాముల పాటి చెయ్యకపోరు. తెగించి వర్షంలో తడుస్తూ, చీకట్లో తడుముకుంటూ ఆ పాక చేరుకున్నాము. చేరుకున్నాక తెలిసింది అది కాఫీ హోటల్‌లని. మేము వెళ్ళడం చూసిన కొంతమంది లారీల వాళ్ళు కూడా వచ్చేరు. మరి కొంతమంది అప్పటికే అక్కడ వున్నరు. రమారమి అంతమంది ఒక్కలాగే తడిసిపోయేం.

ఆ హోటల్లో పొట్టి రాటలకి బిగించిన బల్లలు బెంచీలుగా పనిచేస్తున్నాయి. వాటిముందు రాతి పలకం టేబిల్సు ఉన్నాయి. చుట్టూ ఉన్న తడికలు పోస్టర్లు అంటించి ఉన్నాయి. ఒకమూలగా పొయ్యి పక్కన మూడు కుక్కలు ముడుచుకొని పడుకున్నాయి. ఒక కర్ర బీరువాలో పకోడీలు, జంతికలు వగైరా నిలవవుండే టిపిన్లు వున్నాయి. పొయ్యి దగ్గర క్లీనరు కుర్రాడు కూర్చున్నాడు. ఉన్న ఒక్క కుర్చీలోనూ ప్రొప్రయిటరూ కూర్చున్నాడు. అతను కూర్చుంటే ప్రొప్రయిటరు, నిల్చుంటే, సర్వర్! అతని పక్కనున్న టేబిల్ మీదున్న గేస్‌లైటు వెలుగుతోందనడంకంటే మండు తున్నదీ అనడం నిజం! మాతో వచ్చిన లారీల వాళ్ళు ఒక బెంచీ మీద కూర్చున్నారు. అందులో మధ్య కూర్చున్నవాడిని ఒకసారి చూస్తే మళ్ళీ చూడాలనిపిస్తోంది. అతని జుత్తు సగం నెరిసినా దట్టంగా వుంది. అతను గళ్ళలుంగీ, కాకీలాల్చీ తొడుక్కున్నాడు. ఆ బెంచీమీద కూర్చున్న వాళ్ళంతా కాకీ బట్టల్లోనే ఉన్నారు. అందులో ఒకడు బాగా కుర్రాడు. బహుశా లారీ క్లీనరు అయి వుంటాడు. ప్రొప్రయిటరు వాళ్ళ బల్లదగ్గరకి వెళ్ళేడు. ఏం కావాలంటూ....

సలి సలి సణిగేడు క్లీనరు కుర్రాడు.

“మళ్ళీ గనుక సలి అన్నావంటే సంపేస్తాను. లంజికొడకా. ఇక్కడెవడూ ముందని కావలించుకొని లేడు. సలి నీకొక్కడికే కాదు. నోరుమూసుకొని ఒల్లకుండు” అని ఆ కుర్రాడ్ని నాలుగు తిట్టి నువ్వు మావోడి మాటలు యినకు. ఈడికి ఎండెక్కుతే – దాహం, పొద్దుగూకితే సలి. ఇలాంటి కుక్కపిల్ల లంజికొడకు లెక్కడ దొరుకుతారో మా ప్రొప్రయిటరు తల్లికి. ఇంతకీ ఏటిస్తావ్. ఏడిగా ఏటుంది? ప్రొప్రయిటరు వేపు తిరిగి అన్నాడు గళ్ళలుంగీవాడు.

“తైరువడ...”

“అంటే ఏటి మజ్జిగ పుణుకులేనా?”

“జంతికై, పగోడా, బజ్జీ...” రాని అరవయాసతో మాటాడు తున్నాడు ప్రొప్రయిటరు.

“నువ్వెంత పగోడా అన్నా నువ్వు అరవోడివనుకోంగాని, నాకు జంతిక పట్రా. మావోళ్ళకేటి కావాలో సూడు”

వాళ్ళు ఆర్డరిచ్చినవన్నీ తెచ్చేడు ప్రొప్రయిటరు.

గళ్ళలుంగీవాడు ఒక జంతిక కొరికి “హబ్బా” అని చెంప చెత్తో పట్టుకొని ఒక్కక్షణం పోయేక “సూడు ప్రొప్రయిటరు బాబూ! ఇయ్యి పొట్ల కట్టియ్యి ఇంటికట్టికెళ్ళి పిల్లల కిస్తే దొర్లించు కుంటారు సెక్రాల్లాగ. ఇంతకీ నీ తప్పేటుందిలే. ఈ రేత్తిరి యింత వరసంలో ఇన్ని టిఫిన్లున్నాయంటే, యీ వోరాని వను కోవడం మాదే తప్పు. ఆ పకోడీలట్రా అయ్యేల్లా తగల డ్డాయో సూద్దాం. సూడ్డానికి తుపాకీ గుళ్ళలా వున్నాయి. గవర్న మెంటో ల్లకి అమ్మీ. వాటిని మన గవర్నమెంటు ఎప్పుడూ యుద్ధాని కెల్లదు కాబట్టి అయ్యి పేలీదీ, పేలన్దీ నువ్వు సచ్చీలోపుగా తెల్దు”

ప్రొప్రయిటరు అతని మాటలకి నొచ్చుకోలేదు. అతడు పకోడీలు పట్టుకొచ్చి యిచ్చేడు. గళ్ళలుంగీవాడు ఒక పకోడీ రుచి చూసి ఇది కొంతనయం లంకలో ఇభీషణుల్లా మా అందరికీ “కేపే” లటుకురా. అదుగో, ఆ కొసోడికి మాత్తరం టీ. ఆటు సిన్నప్పుడు దొరలకాడ జోళ్ళు తుడిసినోడట. అంచేత ఆడు ‘టీ’ తప్ప కాఫీ తాగడు అన్నాడు.

ప్రొప్రయిటర్ కాఫీలు, టీలు తెచ్చి వాళ్ళ బల్ల మీద పెట్టి తన కుర్చీ దగ్గరకు వెళ్ళిపోయాడు. ప్లేట్లు తీసుకోవడానికి వాళ్ళ బల్లమీద పెట్టిన కుర్చీ దగ్గరకు వెళ్ళేడు పొయ్యి దగ్గరున్న క్లీనరు.

అప్పుడుకాఫీ రుచి చూసిన లుంగీవాడు "మీ ప్రొప్రయిటరు ఏటేసాడ్రా డికాక్షన్లోకి? కాఫీ గింజలా! సింతపిక్కలా! ఏదైతేనెట్లే ఏడిగుంది అంతేసాలు" ఇంత సీకట్లో దొరసానై తేనేటి? దొమ్మరిసానైతేనేటి? ఆడదైతే సాలన్నాట్ట ఎనకటి కెవడో? అని కాఫీ పూర్తి చేసి "బీడీ ముక్కుందా గురూ!" అడిగేడు పక్కవాడిని.

"లేదు గురూ" అన్నాడు పక్కనున్న గురుడు.

ఏటి, నీ సేత బీడిముక్కలు మానిపించేసి బెంజి లారీ కొనేద్దా వనుకుంటున్నాదేటి నీ పెళ్ళాం! బీడీ మానేస్తే దవళ్ళు పీకేగాని బేడా పరకమిగల్దు. నీ మాటాయమ్మ ఎలాగా యినదుగాని నేనే సెప్తాలే.

"అబ్బే మానీలేదు గురూ" ఎపాలజెటిక్‌గా అన్నాడు పక్కవాడు.

వాళ్ళలో ఒకడు బీడీల కట్ట బల్లమీద పడేశాడు. అందరూ బీడీలు అంటించేరు.

ఇంత స...చెమించు గురూ! అన్నారు లారీ క్లీనరు.

అన్నం పెట్టడానికి అమ్ముండగా పెళ్లాం దేనికి అనే వయ సురా నీది, నీకే అంత సలైతే మా మాటేమిటి? సలికి ఎవికలు సుట్టుకుపోతున్నాయి. నిన్ననగా బయలెల్లినాం. ఎప్పుడు జేరుతావో కొంప. ఈ లోగా ఏ ఆఫీసరు కారో మన లారీకి గీసు కుంటే యింటికెళ్ళేది వొచ్చీవారమే. ఏం బతుకు్రామనయి. సీ–స్సీ వట్టి కుక్క బతుకులు అన్నాడు గళ్ళలుంగీవాడు.

"మనం ఇలా సలికి నస్తూవుంటే మందు కొట్టేసి కులుకుతూ ఉంటాది మన ప్రొప్రయిటరు ముండ"

మనకే ఆ ముండకున్నంత డబ్బుంటే వాళ్ళలో ఒకడన్నాడు.

నీకు తెల్దురా బాబు. డబ్బుంటే వుండే కష్టాలు, మనకేటీ హాయిగా రాజులాగ ఉంటే తింటాం. నేకపోతే కడుపుతో కాళ్ళె ట్టుకు తొంగుంటాం. మనం పడుకోవడానికి పంకావొద్దు, పరు పొద్దు. మన్లాగ డబ్బున్నోడికి తొంగోమను సూద్దాం. ఆడు పెళ్ళాన్నట్టుకు తొంగుంటాడనుకునేవ్. ఇనప్పెట్టిని పట్టుకొని తొంగుంటాడు. ఇప్పుడు నీకే డబ్బుందనుకో ఇయలా గుండ గలవా? పంటలు కొట్టుకుపోనాయో యేటో నీ తోటలు పడి పోనాయో ఏటో నీ మేడ కూలి పడిపోనాదో ఏటో నీ పెళ్ళాం లేచిపోనాదో ఏటో – ఇలా టాలోచనలతో కుళ్ళిపోతావ్. ఇక మనకంటావా? మన కొంపలు పడిపోతే మూడ్డబ్బులుతో మళ్ళీ లేపేవచ్చు. మన పెళ్ళాలు యెవురుకీ అక్కరలేదు. నువ్వు లచ్చ చెప్పు, ఎయ్యి చెప్పు మన బతుకులే హాయి.

నువ్వు ఎంత చెప్పినా డబ్బున్నోడి మజా మనకెలా గొస్తాది? ఒకడు అమాయకంగా అడిగాడు.

డబ్బు లేకపోతే బాధలు నీకు తెల్దుగాని వుంటే ఉన్నబాధ నీకు తెల్దు. నీకు లచ్చ ఉంటే రెండోలచ్చ యెలాగ చేసు కోవ దమా అన్నదో బాధ ఐపోద్ది. నీకు బూవి ఉంటే పక్క పంతులు పొలం యెలా కలిపేసుకోవడమూ అన్న బాధ. నీకు యాపారం ఉంటే దొంగ లెక్కలు ఎలాగరాయవడా! దొంగబేరం ఎలాగి వ్వడమా! ఇయ్యే ఆలోసెన్లు!

డబ్బుంటే సినిమాలు తియ్యొచ్చు.

తిసెడ్లే మన ఊరు పంతులొకడు. పదేళ్ళ కిందట మెద్రాసు ఎల్లేడు. మరికంట పళ్ళేదు. ముందుటేడు సూస్తే పట్నంలో శవాన్ని మోస్తూ అగుపడ్డాడు. దగ్గరోళ్ళు ఎవరో పోనారనుకొని అప్పుడడక్కుండా మర్నాడడిగినాను. సచ్చినోడు దగ్గరోడూ కాడు దాపలోడూ కాదన్నాడు. ఆ బాబు బాపనోడు కాబట్టి శవాలు మోసుకు బతుకుతున్నాడు. నువ్వే ఆ బాబయితే ఆ పాటికి నీ శవాన్నే మోసీసుందురు.

డబ్బుంటే ఉన్నదాంతో సంతుష్టిపడి పక్కోడి బూములకీ మేళ్ళకి ఆశపడకుండా హాయిగా బతకలేమంటావా?

అంటాను, ముమ్మాటికీ అంటాను. నీకు డబ్బుంటే దాన్ని పెంచాలని లేకపోవచ్చు. కాని దాని ఎలా నిలబెట్టుకోవాలో అనే బాధ నిన్ను తినేస్తాది. కాని అది ఎల్లిపోయీ టైమొస్తే ఎల్లి పోద్ది. లచ్చిం తల్లిని కోకతో కొర్రుకు కట్టేస్తే కోకిప్పుకొని ఎలి పోద్ది టయిమొచ్చినప్పుడు. మాకేటి తెల్సు నాలుగాదివోరాల నక్కలు?

ఆటయం రాకపోతే!

కాని ఏదో ఒకటోస్తాది లచ్చిందేవికి శాపముందట, ఆవిడున్న కాడ సుకం వుండకూడదని ఆఖరికి ఆయమ్మ మొగుడ్ని సూదు. పెపంచం అంతా ఆ బాబుదే అయినా సంద్రంలో మకాం ఎట్టేడు. ఎక్కడ పడుకుంటాడనుకుంటావ్. పందిరి మంచం మీదా, పట్టుపరుపు మీదా కాదు పామ్మీద! ఏటనుభవిం చేస్తు న్నాడంటావ్ ఆ బాబు. అందుకే ఆ యమ్మకి శాపమంటారు.

ఆఖరికి మా నాయుడు కథలో లాగ పిల్లల్లేరన్న బాదేన అట్టు కుంటాది.

ఎవరా నాయుడు? ఏవిటతని కథ!

అదో ప్ద ష్టోరీలే. సెప్తాగాని ముందో బీడీ ముక్కిచ్చుకో. ఆ తర్వాత ప్రొప్రయిటరు బాబుని మరో కాఫీ అట్టుకురమ్మను. సూడొరే బబు వొరసం తగ్గిందేటో. కథకేంగాని తెల్లిరీసరికి ఊరు సేకరపతే పీకట్టుకుంటాది ప్రొప్రయిటరు తల్లి.

వొరసం అలాగే ఉంది అన్నాడు వొకడు గుమ్మందాకా వెళ్ళి.

బీడీ అంటించి కాఫీ చప్పరిస్తూ మొదలు పెట్టాడు అతను కథ.

బాబొరే, నాకిందులో తెలిసింది తక్కువ. ఇన్నది లావూను. ఎంచేతంటే నాకు, తెలిసీ సరికే కదలో ఒళ్ళంతా పెద్దోళ్ళుఐ పోనారు. నా సిన్నప్పుడు అంటే పదేను రోజుల కోపాలి గెడ్డం గీయించుకుండే రోజుల్లో మా ఊళ్లో పెద్ద నాయుడుండేవాడు. ఆ బాబెంతుండీవోడంటావో! కంచు ఇగ్రహంలా అదుగో అంతె త్తుండేవోడు. ఆ బాబు మీసాలు ఇనప మీసాల్లాగ ఇంతం తుండేవి. ఆ బాబు కొప్పు కోయిస్తే ఆరుసవరాలు కట్టించు కోవచ్చు. సెవుల కమ్ములు కరిగిస్తే మూడుతులాలు మిగలాలన్న మాట సేతులు కడియంతో మొడితే మూడు సేర్లు నూనింకు తాది. సిన్నప్పుడు ఏటికెళ్ళినప్పుడు తుపాకీలో గుళ్ళయిపోతే సేత్తో కొట్టి సంపినాడట సిరతపుల్ని, ఆ బాబోపాలి ముండింట్లో వణ్ణంతింటూ ఏదో కోపమొచ్చి ముండ నదుందగ్గర కోకట్టుకొని ఎడంసెత్తో ఎదురు గోడకేసి కొట్టేసినాట్ట. ముండ సచ్చిసి గోడకి అప్పడంలా అంటుకుపోనాదంట.

ఆ బాబు ఎలాగుంటాడో సెప్పినానా, ఇంకా బాబు ఆస్థి మాట. "ఊరు పక్క ముప్పై ఊరవతల ముప్పై మొత్తం అరవై ఎకరాల మాగాణీ–ఇయిగాక అంటు మామిడి తొట్లు, నిమ్మ తొట్లు, 6 దొడ్లు, ముప్పై గొడ్లు. మూడంతస్థుల మేడ ఈటన్నిటి తోటీ రాజుని తాతా అని పిలిస్తే ఓయ్ అని పిలికీ వోడట రాజు".

"ఆ బాబు కెంతమంది పెళ్ళాలు"

"ఇద్దరు"

"ఏం..."

"పెళ్ళాలిద్దరన్నాను గాని ఆడోళ్ళు ఇద్దరన్నానా! ఓరానికో కొత్త కాతా ఎడితేనే గాని ఆ బాబుకి నిద్దరట్టేది కాదట. ఆ జిల్లా హోల్ మొత్తంలో కన్నెరికాల కాంట్రాక్టు ఆ బాబుదేనట"

ఆ బాబుకి కోకల సరదా తరువాత కోర్టులు సరదా. కోడి పుంజుల సరదా ఆ బాబు కిర్రు సెప్పులేసుకొని అత్తా కోడలంచు పంచి కట్టుకోని నోట్లో సుట్టేసుకోని మీసం దువ్వుకుంటూ ఈదిలో నడిసెళుతూ వుంటే ఎనకాతల ఇద్దరు నౌకరీవోళ్ళు వొకడు కోడిపుంజూ, ఒకడు పికిలిపిట్టా, పట్టుకు నడుస్తూ వుంటే ఇలా గెలాగుండి ఓడంటావేటి దర్బారు కెళుతున్న మైసూరు లాగుండీవోడు...

"మరాబాబు పెళ్ళాలు?"

"సెందనం బొమ్మల్లాగుండీ ఓరనడం కన్నా రాతి బొమ్మల్లా గుండీ ఓరనడం కరెక్టు. కుండంత కొప్పూ, బానంత మెజ్జా, సెయ్యెత్తు విగ్రహం నల్లగా ఒక్కొక్కర్తి ఎలాగుండీదంటావేటి? మనిషిని గుద్దితే మూడీశలు బంగారం రాలాలన్న మాట. ఆయమ్మలిద్దరి మద్దెల ఆ బాబు నిలబడితే గౌడు గేదెల మద్దిల డిల్లీ పోతులాగుండీవోడు"

"ఇద్దర్నెందుకు పెళ్ళాడేడు?"

అక్కడే ఉంది లిటిగీసను. ఆ ఇద్దరూ పరాయోళ్ళు కారు. అప్పసెల్లెళ్ళే. ఆ బాబుకి మేనత్త కూతుళ్ళు. ఆ రోజుల్లో ఈ ప్రేమలూ గట్రా ఏడేవీ వుండవిగావు. ఆస్థులు పోకుండా అయిన సంబంధాలు సేసుకోవడం, ఆ తర్వాత యెవడిష్టం వచ్చినట్టు వాడుండడం ఇదే మామూలు.

మొదట పెళ్ళయ్యాక ఆ బాబు పెళ్ళాంతో పడుకున్న రోజులు కన్నా పరాయోళ్ళతోపడుకున్న రోజులే యెక్కువ. వంటికి నలభై ఏళ్ళొచ్చినా వొక నలుసూ కలగలేదన్న ఇచారం బాబుకి లేదు కాని ఆయమ్మకి పట్టుకు పీడింసేసీది. అటు పూరీ మొదలుకొని ఇటు తిరుపతి వరకూ ఆయమ్మ మొక్కని దేవుడు లేదు. కాల్లు కడగని బేమ్మడు లేదు. నోచని నోము లేదు. చెయ్యని దానం లేదు. యెన్ని సేసినా బొజ్జె పెరిగింది కాని కడుపు కానరాలేదు. ఆయమ్మకు నలభై దాటేసరికి దేముడ్ని మొగుడ్నీ నమ్ముకొని నాబంనేదని గ్రహించేసినాది. ఆయమ్మ పాట్లేవో అయమ్మపడ్డాది. ఆ పాపం నానోట సెప్పించుకోకు. అవ్వ! సిన్నా పెద్దా, యెక్కు వాతక్కువా అన్న మాటుండేది గాదు. అన్ని పాపాలు పిల్లలకోసం సేసింది. సరదాకే సేసిందో, పిల్లల కోసమే సేసిందో నాకు తెలీదు కాని, ఆ బాబు మాత్రం ఇటొచ్చి ఆటొచ్చి "నీకు పిల్లలు పుట్టడం పాడుసేనులో పంటలు పండటం ఒక్కపాలే. నాను దత్తత చేసుకుంటాను. ఇంతాస్థి ఒగ్గేసిపోన్నాను. ససే నాతద్దినం

నువ్వెడతావా నీ బాబెడతాడా? సొరగానికి నరకానికిమద్దిల తల కిందులు గుండి పోనాల నేను?" అని రోజు రోజుకీ బెదిరించీ వోడట.

ఎలాగయితేనేం ఆయమ్మకి నలభైఐదూ యాబయ్యా, ఆ బాబుకి అరవయ్యా వచ్చేసరికి ఆయమ్మకి వొక్కినయం తెలిసి పోనాదట, తనకింకపిల్లలు పుట్టరని, ఇంతాస్థిపోకుండా నిల బెట్టుకోవాలంటే వొక్కటే మారగం కనిపించింది. ఆయమ్మకి. అంచేత యెంటనే సవారీ బండి కట్టించుకొని ఓ పొద్దు పుట్టిం టికి పోనాదట. పోయి సెల్లెల్ని పంపి యిదిగో సెల్లెలూ నాను సెప్పేది జాగర్తగ విను. నాన్నీ కంటే పెద్దదాన్ని. మరంచేత నాను సెప్పావొచ్చు, నువ్వినావొచ్చు. నీ మంచికీ నా మంచికీ వొక మాట సెపుతా వినుకో.

నాకు మొగుడున్నాడు. ఆ మొగుడికి లంకంత ఇల్లు, సంద్రం అంత సేనూ ఉంది కాని, ఎత్తుకోవడానికి పిల్లలేదు, మాంసస్తే సాకలోడు నోట్లో నీళ్ళు పొయ్యాల్సిందే గాని వేరే దిక్కు లేదు.

ఇక నీకంటావా, నిలువగ ఎంతెదిగినావో అడ్డంగా అంతెదిగి నావు. మన బాబు ఆస్తి తాకట్టుపోతే నీకు పసుపు కొమ్ముకు రాదు. నువ్వు సిన్నదానివి. నీకు ఏవో ఆలోసెన్లుంటాయి. నీ వుద్దేశాలకు నేనడ్డురాను. అంచేత మానాయుడ్నినీకు పుస్తికట్టనీ. పెళ్ళయేక నీ సోకులు నువ్వు మానుకోకు. నాకు సేతనైన సాయం నేను చేస్తాను. ఆడదాని మెళ్ళో నల్లపూసుంటే నూరు పాపాలు కాస్తాది. మరింకింత కంటే ఇవరంగా నన్ను సెప్ప మనకు. కాని ఒక్కమాట ఎలాగో ఓలాగు ఒక్క కొడుకుని మాత్రం కనీ!.

అప్పకు మొగుడులాటిది సెల్లెలు. అంచేత అసలు ఇసయం ఇట్టే గ్రహించేసింది. ఇటుపైన కడుపులు దించుకోవాలన్న బెంగుండదు. ఈదిలో మెగుడువుంటో సాలు పెరట్లో పాపాలు పైకిరావు. అని సెప్పి పెళ్ళి కొప్పేసుకుంది, ఆ పెళ్ళి కూడా నానుసూడ్నేదు.

"రెండో పెళ్ళామన్నాం కదా?"

"కనలేదు గాని ఆయమ్మ తప్పుకాదు ఆయమ్మ చెయ్యాల్సిం దంతా సేసింది. ఆయమ్మ ప్రతిపనికీ అప్ప అండగుండేది. అయితే అప్పకీ సెల్లెలకీ బేదమేటంటే అప్ప మొదట్లో దేముడ్ని నమ్మేక మనిషిని నమ్ముకుంది. సెల్లెలు తొలికాడ్నుంచీ మను షుల్నే నమ్ముకుంది"

"ఇదిలాగుండగా నాయుడికి అరవైఐదో అరవై యారో వెళ్ళి పోనాయి. పిల్లలేరన్న దిగులుతో నదుంజారొగ్గేసిన పాపానికి జబ్బుచేసి మంచం అట్టేసినాడు. ఆ బాబులాగ మంచం ఎక్కి నాడో లేదో మూల మూలల్నించీ దిగినారు. వోరసులు. బొమ్మ ల్లాంటి పిల్లల్తో. మా కొడుకుని దత్తత సేసుకో, మా పిల్లోడ్ని సేసుకో అని ఆ బాబు పేనం గొలుక్కుకనీసినారు. ఆ బాబు క్కూడా యములోళ్ళ నీడలు కనిపించీయో ఏటో లొంగిపోనాడు. బొందిలో పేనం ఉండగానే కొంపలో కుర్రాడు నడవాలని పట్టుపట్టినాడు. అప్పుడాయమ్మలు ఏటిసేనేరనుకున్నావ్! ఊళ్ళో ఉంటే ఈగల్లాగ ఈ వోరసులు ఊరుకోరని నాయుడ్ని పట్నం తీసుకుపోయి అక్కడ పెద్ద డాక్టర్ల చేతిల్లో ఎట్టేరు. ఆ డాక్టర్ల మందులకో, ఈయమ్మలి పాతివ్రొత్యానికో తెల్దుగాని ఆ బాబు బైటపడి బట్టగట్టినాడు. మళ్ళీ ఊరొచ్చీలోగానే ఆ పట్నంలోనే ఆ బాబుకి నూరిపోసినారా తల్లులు నీకేటి తక్కువ దత్తత చేసుకోడానికి. దిమ్మిస దుక్కలాగున్నావు? ఓ జబ్బు చేస్తే చచ్చిపోయినట్టేనా? ఇప్పటికీ నవ్వా గుద్దు గుద్దితే ఈశ్వరుడైనా మూడు కళ్ళూ మూసీవలసిందే. ఈ జిల్లాలో మూతిమీద మీసం వొచ్చిన మగాడ్నేనా నీతో తాగమను, తినమను సూద్దాం. నీ సత్తువ నీకు తెల్దు. మాకు తెల్సు. మనకి పిల్లల్లేరంటే ఆ దోషం మాదిగాని తప్పు నీది కాదు. మూణ్ణెల్లు టయిమియ్యి. వచ్చిన వోరసుడ్ని ఈప్మీదగుద్ది పంపించీ, నీకో గుమ్మటం లాంటి గుంటని తెచ్చి పెళ్ళిచేస్తాం. ఒక సంవత్సరంటయిమియ్యి ఆ గుంటకి అప్పటికీ అది కనకపోతే నీ యిష్టం. నీ ఆస్థికి దత్తతే సేసుకుంటావో, దానాలే సేసుకుంటావో. నీ కడ్డొస్తే కొప్పులు కోసి ఈదిలోకి ఈడిసీ మమ్మల్ని అని నచ్చచెప్పారు.

ముసిలోడికి మళ్ళీ పెళ్ళంటే మతిపోనాది. కంసాలి సెవం లాగ తలపాగా ఎట్టుకొని తయారైపోనాడు సెయ్యమని.

ఆ యమ్మలు మూడ్నెల్లు టయామడిగినారా. మూడోరాల్లో పట్టుకొచ్చినారు పెళ్ళికూతుర్ని. సికాకోళం అవతల్నుంచి. మూర్తా లేవని బేమ్మడేడిసినా, బెదిరించి పెట్టించినారో ముహూర్తం. అదిగో నానెళ్ళిందా పెళ్ళికి. నేతికి ఎవికలు ఇరుసుకొని కర్చెట్టి నారా పెళ్ళికి. అనకాపల్లి సరుకు పనికిరాదని బెజవాడ నుంచి తెప్పించినారు బోగమేళం. పెళ్ళినాడు ఊళ్ళో ఎవరినీ పొయిలో నిప్పేసుకోనివ్వలేదు. సెరుకు పెనాలతో తెప్పించినారు సారా. తొలిపాలి నేను రుచి చూసింది ఆ పెళ్ళిలోనే.

రేత్తిరి మూర్తం. పెళ్ళి పందిరి కిటకిట లాడిపోనాది. ఆ పెళ్ళికి మాఊరు తొలిసారి గ్యాస్ లైట్లు తెప్పిస్తా.

ఇక పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ అంతావా. నల్లమందు అలవాటైందేమో పీటమీద కూసున్న నాయుడు పీటమీదే తూలు తున్నాడు. సిన్నప్పుడు తిరిగిన తిరుగుళ్ళకి మనిషి ఊరిపోయి ఉబ్బిన శవం లాగున్నాడు.

ఇక పెళ్ళికూతురంటావా? వయసులోనే నాయుడు పెద్దా ఆమె సిన్నా. మనిషి మాత్తరం అతనంతా ఉంది. ముక్కు నోరంతా ఉంది ఎడల్పు. పట్టుకోకా, జరీ రవికా తొడుక్కొని ఇంతింత జెబ్బలతో నల్లగా ఇలా గెలాగుందంటె ... మన ఊరవతల అమ్మోరు పట్టుకోక కట్టుకొని నడిచొచ్చేసి పీటమీద కూకుంటే ఎలాగుంటుంది – అదిగలాగుంది. ఆయమ్మ పీటమీద కూకుంటే కడుపు బేమ్మడి ఒళ్ళో ఉంది. మొగోడికి ఆడ ఏసం ఏసినా ఆయమ్మ కంటే బాగుంటాడు.

ఇలాగ తిన్న పెళ్ళి బూర్లు అరిగేయో లేదో అలా ఆ మూడో పెళ్ళానికి కడుపన్నారు రెండోనెల్నే గాజు నెట్టించేసినారు మాకిదే ఆచారం అంటూ. పెళ్ళయిన మూడ్నెల్లకి పురిటి కొచ్చేసినట్లయి పోనాది ఆ మనిషి. ఈ ప్రతాపమంతా తనదే అయినట్లు నాయుడు తంగీవోడు అడిగనోడిదే పాపం. అందరికిసెప్పేవోడు తన పెళ్ళానికి కడుపని.... బాబురే వొరసం తగ్గినట్టుంది సూడు – లేవడానికి నాకు కీళ్ళు పట్టేసినాయి అని ఆగేడు బీడీ అంటిస్తూ...

"కద కానీ తర్వాత చూద్దాం" అన్నాడొకడు.

కదదేటుందిరా అయిపోనాది. మరోనెల పోనాక ఆయమ్మ కడుపు పోనాది, ఏతాం కాడ, ఉన్న నాయుడు ఈ మాటినగానే కళ్ళు తిరిగి ఇరగబడిపోయి నూతిలో పడి సచ్చేసినాడు. ఏ బరంపురం నుంచో వోరసుణ్నంటూ ఎవరో వచ్చి ముగ్గురు ముండలకీ మనోవర్తి పారీసి, అదిగో నాను సెప్పేనా వొరసం పోనాదని, లారీలు స్టార్టయి పోనాయి. నెగండి మనోవర్తి మూడ్డబ్బులు మరీసి ఆస్తంతా పట్టుకుపోయేడు అంటూ లేచి పోయేడు అతను.

**(1975)**

# పెన్సిలిన్ ఐపోయింది

అలా తనెంత సేపు ఆ వరండాలో కూర్చునుందో ఆ ముసలమ్మకి తెలిదు కాని సుమారు ఓ గంట గడిచేక హాస్పిటల్ తలుపులు తెరుచుకున్నాయి. తను మొక్కిన దేవుడు స్వయంగా వచ్చి తన కోసమే గుడితలుపులు తెరచి నట్టనిపించిందామెకి, ఆలస్యం చేస్తే తన దేవుడు మాయమైపోతాడేమోనన్న ఆతృతతో భుజం మీదున్న పిల్ల బరువుకి తూలుతూ ఆమె లోపలికి వెళ్ళింది.

అప్పటికే కుర్చీలో కూర్చొని తలొంచుకొని ఏదో రాసుకుం టున్న డాక్టరు రాజ్వేరరావు తలెత్తకుండానే అడిగేడు.

"పేరు?"

ముసల్ది మాట్లాడలేదు. పసిదానికి పేరులేదు.

జవాబు రాకపోవడంతో తలెత్తి చూసేడు డాక్టరు. ఎదురుగా నిల్చున్న ముసలమ్మ పుట్టగానే చచ్చిపోయి ఎదిగి, ముసలై పోయిన శవంలా వుంది. చచ్చిపోయిన పాదు చివర్న వెలాడు తున్న యెండు కాయలా ఆమెభుజాన వేలాడుతోంది ఓ పిల్ల. ఆ పిల్లకి నాలుగేళ్ళ వయసూ, నాల్రోజులజ్వరమూ ఉన్నాయి. ముందు ముందు తను పడవలసిన బాధలన్నీ ఎదురుగా కన్పిస్తు న్నట్టు, వాటిని చూడలేక భయపడి పోయినట్లు, ఆ పిల్ల కళ్ళు బెదురుతున్నాయి. జబ్బు ముసలిదానికా, పిల్లకా అన్నట్టు ఆశ్చర్య పోయే డతను. ఇద్దరూ "కంపుజబ్బు" చేసినట్టు దుర్వాసన కొడుతున్నారు.

"ఏవిటి సుస్తీ"?

"నాల్రోజులై ఒళ్ళు కాలిపోతున్నాది. పడవలా పడిపోనాది పిల్ల."

స్టెత్ తీసుకొని లేచాడతను. "ఏమౌతుంది నీకీపిల్ల?" అని పరామర్శిస్తూ..

పరీక్ష పాసై పదినెల్లూ, ఈ తాలూకా హాస్పిటల్లో చేరి ఆరు నెలలే అయినప్పటికీ తన మీదున్న ముగ్గురు పెద్ద డాక్టర్లకంటే తానే పాప్యులర్ అయిపోవాలని అతని ఆశ.

"కూతురు... మిగిల్చిపోనాది".

ఆ పిల్ల చనిపోయిన ఆమె కూతురు మిగిల్చిపోయిన మచ్చ. ఆమె కలల పంట.